నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

అరమరికలు లేని యాత్మీయ స్నేహంబు
కలిగియున్నయెడల కలుగు శుభము
చిన్నచిన్నగొడవ చీటికి మాటికి
చేసుకున్నయెడల చేటు సుమ్ము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 182 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 11-10-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




## చెదిరిన ట్రంప్ కల..

- 8 యుద్ధాలు ఆపినా నోబెల్ రాలేదు..!

న్యూఢిల్లీ,

ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం వెనిజుల ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోకు దక్కింది. దాంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ కల చదిరిపోయింది. ఈ క్రమంలో ఈ అవార్డుపై వైట్ హౌస్ స్పందించింది. డొనాల్డ్ ట్రంప్‌కు బదులుగా వెనిజులా ప్రతిపక్ష నాయకురాలికి శాంతి పురస్కారాన్ని ఇవ్వాలన్న నోబెల్ కమిటీ నిర్ణయాన్ని శ్వేత సౌధం విమర్శించింది.నోబెల్ బహుమతిని ఎంపిక చేసే ప్యానెల్ శాంతికి బదులుగా రాజకీయాలను ఎంచుకుందని పేర్కొంది. వైట్ హౌస్ ప్రతినిధి స్టీవెన్ చియుంగ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.

-మిగతా 2 లో

# సంక్షేమ హాస్టళ్లలో సమస్యలకు చెక్

## రూ. 60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్స్ విడుదల

- ఒక్కో ఎస్సీ, బీసీ సొసైటీకి రూ. 20 కోట్లు.. అలాగే ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ. 10 కోట్ల చొప్పన ఫండ్స్ రిలీజ్
- సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం





హైదరాబాద్ అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
సంక్షేమ హాస్టళ్లలో తరచూ వస్తున్న సమస్యలకు తక్షణం చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో తరచూ ఏదో ఒక సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ వెల్ఫేర్ సొసైటీ స్థాయి హాస్టల్స్‌లోని సమస్యలను పరిష్కరించేందుకుగాను రూ. 60 కోట్ల ఎమర్జెన్సీ ఫండ్స్‌ను ఆయన విడుదల చేశారు. ఒక్కో ఎస్సీ, బీసీ సొసైటీకి రూ. 20 కోట్లు.. అలాగే ఎస్టీ, మైనార్టీ సొసైటీలకు రూ. 10 కోట్ల చొప్పున ఫండ్స్ రిలీజ్ చేశారు. ఈ ఎమర్జెన్సీ ఫండ్స్ వినియోగించే అధికారాన్ని సొసైటీ

-మిగతా 2 లో



## పాక్‌కు భారీ షాక్ ఇచ్చిన యూఎస్

- ఆ మిస్సైల్స్ సరఫరాకు నో..!

న్యూఢిల్లీ,

దాయాది దేశం పాకిస్తాన్‌కు భారీ షాక్ తగిలింది. అత్యాధునిక మిస్సైల్స్‌ను సరఫరా చేసేందుకు అమెరికా నిరాకరించింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్తాన్‌కు కొన్ని ఆయుధాలు, సామగ్రి సరఫరా చేస్తామని.. అయితే, కొత్త ఆయుధాలను మాత్రం సరఫరా చేయబోమని అగ్రరాజ్యం స్పష్టం చేసింది. పాక్‌కు ఆధునిక అడ్వాన్స్‌డ్ మీడియం రేంజ్ ఎయిర్-టు-ఎయిర్ క్షిపణులను అందిస్తుందని పలు నివేదికలు తెలిపాయి. తాజాగా ఈ వార్తలను యూఎస్ ఖండించింది. ఈ మేరకు అమెరికా రాయబార కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేసింది.సెప్టెంబర్ 30న యుద్ధ విభాగం పాక్‌తో సహా అనేక దేశాలకు ఆయుధాలు, సామగ్రి అమ్ముతున్నట్లుగా ప్రకటించింది. పలు మీడియా నివేదికలు మాత్రం అమ్రామ్ మిస్సైల్స్‌ను పాకిస్తాన్‌కు సరఫరా చేస్తారని పేర్కొన్నాయి. అయితే, పాక్ సైనిక ప్రస్తుత సామర్థ్యాలను పెంచే ప్రణాళిక ఏం లేదని తాజాగా యూఎస్ తేల్చి చెప్పింది. పాక్‌కు అమ్రామ్ మిస్సైల్స్‌ను అమ్మకాన్ని యూఎస్ యుద్ధ విభాగం ఆమోదించిందని అనేక పాకిస్తాన్ మీడియా


-మిగతా 2 లో

## ఆఫ్ఘన్ గడ్డపై భారత్ వ్యతిరేక చర్యలను అనుమతించం

- తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ

న్యూఢిల్లీ,

అఫ్ఘాన్ భూభాగంలో ఇతర దేశాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలను అనుమతించబోమని తాలిబాన్ విదేశాంగ శాఖ మంత్రి అమిర్ ఖాన్ ముత్తకీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో పాక్‌ను ఉద్దేశిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. అఫ్ఘానిస్థానీల ధైర్యసాహసాలకు పరీక్ష పెట్టొద్దని కూడా గట్టి వార్నింగ్ ఇచ్చారు. కాబుల్‌లోని తెహ్రీక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులను టార్గెట్ చేస్తూ పాక్ దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. అయితే, అఫ్ఘాన్ కేంద్రంగా చేసుకుని తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదుల తీరుతో సహనం నశించి ప్రతి దాడి చేస్తు?న్నామని పాక్ పేర్కొనడం గమనార్హం. పాక్ దాడులపై అఫ్ఘాన్ మంత్రి ముత్తకీ



-మిగతా 2 లో

## హైడ్రా చర్యలతో ఆక్రమణదారుల్లో దడ

- మంచి ఫలితాలు ఇస్తోందన్న డిప్యూటి సీఎం
- హైటెక్స్ ప్రాపర్టీ షో ప్రారంభించిన భట్టి విక్రమార్క

హైదరాబాద్ అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
హైడ్రాతో కొంత భయం ఏర్పడినా ఫలితాలు కనిపిస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, చెరువులను హైడ్రా కాపాడుతోందని వివరించారు. దీంతో ఆక్రమణదారుల్లో భయం పెరిగిందని, ప్రభుత్వ భూములకు భరోసా దక్కిందని అన్నారు. ఇకపోతే హైదరాబాద్ అభివృద్ధికి ఏటా రూ.10 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గత రెండేళ్లలో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. మూసీ నది సుందరీకరణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు.


-మిగతా 2 లో



# హైడ్రా దూకుడు

## బంజారాహిల్స్ వద్ద హైడ్రా భారీ ఆపరేషన్

- 5 ఎకరాల్లో ఆక్రమణల తొలగింపు
- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణలను గుర్తించిన హైడ్రా
- చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపలా
- భూమి విలువ 750 కోట్లు ఉంటుందని అంచనా



హైదరాబాద్ అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
హైడ్రా మరో భారీ ఆక్రమణను తొలగించింది. బంజారాహిల్స్‌లో ఆక్రమణలను హైడ్రా తొలగించి, 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. రూ.750 కోట్ల విలువైన భూమిగా అధికారులు గుర్తించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లో ఆక్రమణలను గుర్తించిన హైడ్రా శుక్రవారం బారీ బందోబస్తు మధ్య తొలగించింది. గతంలో ప్రభుత్వం 5 ఎకరాల్లో 1.20 ఎకరాలను జలమండలికి కేటాయించింది. ఈక్రమంలో 1.20 ఎకరాలతో పాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కోర్టుకెక్కాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతో పాటు వేటకుక్కలతో కాపలా పెట్టాడు. కోర్టులో వివాదం ఉండగా మొత్తం భూమిని తన అధీనంలోకి తీసుకొని అందులో షెడ్లు

-మిగతా 2 లో



## కొరినా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి

- నోబెల్ శాంతి బహుమతి ట్రంప్‌కు అంకితం
- తమ పోరాటానికి అండగా నిలబడ్డందుకు కృతజ్ఞతలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతినిఅమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అంకితం ఇస్తున్నట్లు వెనిజులా పోరాటయోధురాలు మరియా కొరీనా మచాడో ప్రకటించారు. ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు వెనెజువెలా హక్కుల కార్యకర్త మరియా కొరీనా మచాడోను ఈ పురస్కారం వరించింది. దీనిపై తాజాగా మచాడో తన సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ.. ట్రంప్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ పురస్కారాన్ని వెనెజువెలా ప్రజలతోపాటు తమ ఉద్యమానికి మద్దతుగా నిలుస్తోన్న డొనాల్డ్ ట్రంప్‌నకు అంకితం

-మిగతా 2 లో



## బిసిలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

- మోసం చేయడంలో ఇద్దరి జీన్స్ ఒక్కటే
- జూబ్లీహిల్స్‌లో గెలిచి మోడీకి గిఫ్ట్‌గా ఇస్తాం
- పార్టీ నేతల సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు రామ్

హైదరాబాద్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బీసీలను బిఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, బీ ఆర్ఎస్ జీన్స్ ఒక్కటేనని ఎద్దేవా చేశారు. నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గ్రేటర్ పరిధి జిల్లాల సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రచారం, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

-మిగతా 2 లో

## కొట్లాడడమే జాగృతి లక్ష్యం

- ఇచ్చిన హామీల కోసం ప్రభుత్వంతో పోరాటం
- జాగృతి అధ్యక్షురాలు కవిత పిలుపు



హైదరాబాద్,

జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లు ఉంటుందని.. అదే విధంగా పిడికిలెత్తి పోరాటం చేయాల్సి ఉంటుందని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పోరాటాలు జాగృతి రక్తంలోనే ఉన్నాయని అన్నారు. తెలంగాణ పోరాటంలో అగ్రభాగాన నిలబడ్డామని అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కార్యాలయంలో పలువురు

-మిగతా 2 లో

## ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ మెరుపు దాడులు

- తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు
- ఆఫ్ఘాన్ మంత్రి భారత్ పర్యటన వేళ ఈ ఘటన



న్యూఢిల్లీ,

తాలిబన్ పాలనలోని ఆఫ్ఘనిస్థాన్‌పై దాయాది పాకిస్థాన్ మెరుపు దాడులు చేసినట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ లో బాంబు పేలుళ్లు కలకలం సృష్టించాయి. తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సమాచారం. ఈ దాడుల్లో టీటీపీ చీఫ్ ముఫ్తీ నూర్ మెహూస్ద్ మరణించి ఉండొచ్చని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.పలు అంతర్జాతీయ నివేదికల ప్రకారం.. కాబూల్‌లోని తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్థాన్

-మిగతా 2 లో

# చెదిరిన ట్రంప్ కల..

(మొదటి తరువాయి)



యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ శాంతి ఒప్పందాలకు మధ్యవర్తిత్వం చేస్తూ యుద్ధాలను అడ్డుకుంటూ ప్రాణాలను కాపాడుతూనే ఉంటారన్నారు. ఆయనకు మనవతావాది అని.. ఆయనలాంటి వారు తన దృఢ సంకల్పంతో పర్వతాలను సైతం కదిలించగలరన్నారు. ఇదిలా ఉండగా.. ఐరల్ లేడీగా పిలుచుకునే వెనిజుల ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో టైమ్ మ్యాగజైన్ 2025 వంద మంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. వెనిజులా ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసిన పోరాటంలో ఆమె కృషికి శాంతి పురస్కారంతో మచాడోను సత్కరిస్తున్నట్లు నోబెల్ కమిటీ పేర్కొంది.

# సంక్షేమ హాస్టళ్లలో సమస్యలకు చెక్

(మొదటి తరువాయి)

సెక్రటరీకి దాఖలు పడేలా జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేశారు. హాస్టల్స్‌లోని సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ తరహా ప్రత్యేక ఫండ్స్‌ను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గురుకులాలు, హాస్టళ్లలో తరచూ సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. అవి మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ప్రతిపక్షాలు స్పందించి.. నిధుల లేమి వల్లే ఈ తరహా ఘటనలు చోటు చేసుకుంటున్నాయంటూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. అంటే ఫిజికల్ ఇన్‌ఫ్రాస్టేక్చర్, ఫుడ్, హెల్త్, టీచింగ్ తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వైపు నుంచి నిధులు కోసం ఎదురు చూడకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఈ వినూత్న ఆలోచన చేసినట్లు తెలుస్తుంది.

# పాక్‌కు భారీ షాక్ ఇచ్చిన యూఎస్

(మొదటి తరువాయి)

ఛానెల్స్‌ను సైతం పేర్కొనడం గమనార్హం. టక్సన్, అరిజోనాలో ఉన్న రేథియాన్ కంపెనీ పాకిస్తాన్‌కు అధునాతన క్షిపణులను సరఫరా చేస్తుందని ఓ నివేదిక పేర్కొంది. ఈ నివేదికలను పాకిస్తాన్ వైమానిక దళం సైనిక సామర్థ్యాలను పెంచే చర్యగా భావించగా.. తాజాగా అమెరికా అలాంటి ప్రణాళికలు లేవని స్పష్టం చేసింది. పాకిస్తాన్ F-16 ఫైటర్ జెట్‌ల కోసం 2007లో అమెరికా నుంచి 700 అమ్రామ్ మిస్సైల్‌ను తీసుకుంది. ఆ సమయంలో ఇది ఎయిర్-టు-ఎయిర్ అమ్రామ్ మిస్సైల్స్ కోసం అతిపెద్ద అంతర్జాతీయ ఆర్డర్. పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ సెప్టెంబర్‌లో వైట్ హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలిసినప్పుడు కొత్త ఒప్పందంపై ప్రచారం జరిగింది. యూఎస్ ఎయిర్ ఫోర్స్ ప్రకారం.. ఈ ఈ మిస్సైల్ ప్రత్యేక లక్షణం దాని టార్గెట్-లాక్ సామర్థ్యం దీని సొంతం. ఇది సూపర్‌సోనిక్ వేగంతో ప్రయాణించి, కంటి రెప్పపాటులో తన లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. దీనిని సెప్టెంబర్ 1991లో యూఎస్ సైన్యంలో చేర్చారు. హ్యూస్ ఎయిర్‌క్రాఫ్ట్ కంపెనీ, రేథియాన్ సంయుక్తంగా తయారు చేస్తున్నాయి. ఈ క్షిపణి 143.9 అంగుళాలు పొడవు, 150.75 కిలోల బరువు ఉంటుంది.

# అఫ్ఘన్ గడ్డపై భారత్ వ్యతిరేక చర్యలను అనుమతించం

(మొదటి తరువాయి)




స్పందించారు. 'సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాలపై దాడులు జరిగినట్టు తెలుస్తోంది. పాక్ తప్పు చేస్తోంది. దాదాపు 40 ఏళ్ల తరువాత అఫ్ఘానిస్థాన్‌లో శాంతి నెలకొంది. అభివృద్ధి కనిపిస్తోంది. ఈ సమయంలో మా ధైర్యసాహసాలను పరీక్షించే ప్రయత్నం చేయొద్దు. ఇలా చేస్తే ఏం జరుగుతోందో రష్యా, అమెరికా, నాటోలను వెళ్లి అడగొచ్చు. అఫ్ఘాన్‌తో గేమ్స్ వద్దని వారు చెబుతారు' అని ముత్తకీ వార్నింగ్ ఇచ్చారు. సీమాంతర ఉగ్రవాదం అంశంలో గత కొన్ని నెలలుగా పాక్, అఫ్ఘానిస్థాన్ మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం భారత్‌కు దౌత్య బంధాలు మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నించడం పాక్‌కు కంటగింపుగా మారింది. ఈ క్రమంలోనే సీమాంతర దాడులకు దిగొద్దంటూ పాక్‌ను అఫ్ఘాన్ మంత్రి హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో సమస్యలు పరిష్కారం కావని హెచ్చరించారు. ఇక అఫ్ఘానిస్థాన్ సౌర్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్యానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ముత్తకీకి భరోసా ఇచ్చారు.

# హైడ్రా చర్యలతో ఆక్రమణదారుల్లో దడ

(మొదటి తరువాయి)




రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రం మార్చబోతున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కలిసేలా దీని నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వనరులు, అవకాశాలపై ప్రచారం బాధ్యత నరెడ్కోపై ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అన్నివైపులా హైదరాబాద్ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని చెప్పారు. నరెడ్కో ఆధ్వర్యంలో హైటెక్స్‌లో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి భట్టి విక్రమార్క శుక్రవారం ప్రారంభించారు. నరెడ్కో బ్రౌచర్‌ను వారు ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు ప్రాపర్టీ షో కొనసాగనుంది. ఇందులో పలు స్థిరాస్తి సంస్థల స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందని ప్రచారం చేశారు. రాయదుర్గంలో ఎకరా రూ.177 కోట్ల ధర పలకడంతో నగర అభివృద్ధి ఎలా దూసుకుపోతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడిపిస్తున్నాం. భవిష్యత్తులో అన్నీ ఇవే ఉంటాయి. వీటికి పన్ను మినహాయింపులు కూడా ఇచ్చాం. మురుగునీటిని శుద్ధి చేయడానికి రూ.4 వేల కోట్ల వ్యయంతో ఎస్టీపీలను నిర్మించబోతున్నాం. నగరం నలువైపులా మెట్రోను విస్తరిస్తున్నాం. విద్య, వైద్య రంగంపై మరింత దృష్టిసారిస్తున్నాం. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో 100 స్కూళ్లను నిర్మించబోతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. నరెడ్కో ప్రతినిధులు సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగంపై పెద్దమొత్తంలో ఖర్చు చేయండి. విల్లాలు, హై రైజ్ బిల్డింగులకే పరిమితం కావొద్దు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేయండి. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లు, బిల్డర్లను రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు.

# బిసిలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

(మొదటి తరువాయి)



భాజపాతోనే బీసీలకు న్యాయం జరుగుతుందనే నిర్ణయానికి ప్రజలు కూడా వచ్చారన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందని చెప్పారు. నగరాన్ని ప్రపంచానికే తలమానికంగా మారుస్తామని భారత రాష్ట్ర సమితి గతంలో చెప్పింది.. కానీ అందుకు అనుగుణంగా ఎలాంటి ముందడుగు పడలేదు. కాంగ్రెస్ కూడా అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చింది. ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగాయి. రెండు మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తాం. ఈ ఉప ఎన్నికలో గెలిచి ప్రధాని మోదీకి గిఫ్ట్‌గా ఇవ్వాలి. రేపటి నుంచి కార్యకర్తలు, నేతలు జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేయాలి. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందాన్ని తిప్పికొట్టాలని రామచందర్‌రావు కోరారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణ రాష్ట్రంలో సిద్ధంగా ఉన్నామని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో తాము గెలుస్తామని పూర్తి నమ్మకం ఉందని, ప్రజలపై విశ్వాసం ఉందని ఉద్ఘాటించారు. విశ్వనగరం పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నగర ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయని ఆక్షేపించారు. వర్షం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితులు నగరంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎర్రగడ్డలో కాలనీల మధ్య ముస్లింలకు శ్మశాన వాటికలు ఎలా కేటాయిస్తున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హిందూ దేవాలయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చేస్తోందని ఆరోపించారు. నగరంలో హిందువులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి బీజేపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ జూబ్లీహిల్స్‌లో గ్రౌండ్ లేవల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్గనిర్దేశం చేశారు. బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసం చేశాయని ధ్వజమెత్తారు. బీజేపీ వల్లే బీసీలకు న్యాయం జరుగుతోందని ప్రజలు కూడా ఈ నిర్ణయానికి వచ్చారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తాము గెలుస్తామనే పూర్తి నమ్మకం ఉందని రాంచందర్ రావు ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, అభయ్ పాటిల్, చంద్రశేఖర్ తివారీ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీల సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపిక, ప్రచార కార్యక్రమాలు, గెలుపు వ్యూహాలపై చర్చించారు.

# హైడ్రా దూకుడు

(మొదటి తరువాయి)

నిర్మించాడు. ప్రభుత్వ భూమిని అడ్డాగా చేసుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు జలమండలి, రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ వాటర్ రిజర్వాయర్ నిర్మించాలనే జలమండలి ప్రయత్నాలను పార్థసారథి అడ్డుకున్నాడు. ఫేక్ సర్వే నంబర్ (403/52)తో ప్రభుత్వ భూమిని కొట్టేసే ప్రయత్నం చేశాడు. ఈ మేరకు పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి 403 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఉంటే.. 403/52తో ఆక్రమణలకు పాల్పడినట్లు అధికారులు నిర్ధరించారు. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఈక్రమంలో షేక్‌పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య శుక్రవారం హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణదారు వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్లను హైడ్రా తొలగించింది. 5 ఎకరాల చుట్టూ కొత్తగా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి.. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో ఆక్రమణకుగురైన ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా గుర్తించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో, శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ హైడ్రా సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. కాగా, వీఆర్ ఇన్‌ఫ్రా పార్థసారథి, ఆయన కుమారుడు విజయ్ భార్గవా భూమిని కబ్జా చేసినట్టు తెలిసింది

# కొట్లాడడమే జాగృతి లక్ష్యం

(మొదటి తరువాయి)

తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి తమ సంస్థలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు రూ.2,500 నెలకు ఇస్తామని మోసం చేసిందని.. అందుకోసం కొట్లాడాలంటూ సంస్థలోని సభ్యులకు ఆమె పిలుపు నిచ్చారు. ప్రసవం కోసం ఆస్పత్రులకు వెళ్లిన మహిళలకు గతంలో కేసీఆర్ కిట్ వచ్చేదని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అది కూడా ఆగిపోయిందంటూ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. అడబిడ్డలకు కిట్ల సాధన కోసం ప్రభుత్వంపై కొట్లాడాలని సూచించారు. పేదింటి బిడ్డ పెళ్లికి ఇస్తానన్న తులం బంగారం కోసం కొట్లాడుదామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలంటూ గద్దెనెక్కి కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ముఖ్యంగా బీసీ బిల్లు తెస్తామని.. తీసుకు రాలేనందుకు కు జాగృతి ఆధ్వర్యంలో కొట్లాడదామని పేర్కొన్నారు. జాగృతి అంటేనే పోరాటాల జెండా.. జాగృతి అంటేనే విప్లవాల జెండా అంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.

## ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ మెరుపు దాడులు

(మొదటి తరువాయి)

శిబిరాలే లక్ష్యంగా పాక్ జెట్‌లు వైమానికి దాడులు చేశాయి. టీటీపీ చీఫ్ నూర్ మెహ్సూద్‌ను హతమార్చడమే లక్ష్యంగా షాహిద్ అబ్దుల్ హక్ స్క్వేర్ సమీపంలో వైమానిక దాడి జరిగినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, పాక్ వైమానిక దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని నివేదికలు తెలిపాయి. పౌర నిర్మాణాలు దెబ్బతిన్నట్లు వెల్లడించాయి. ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఈ సమయంలో కాబూల్‌పై పాక్ దాడులు చేయడం గమనార్హం.

# కొరినా మచాడోకు నోబెల్ శాంతి బహుమతి

(మొదటి తరువాయి)

ఇస్తున్నానని చెప్పారు. వెనెజువెలా ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించడం మా పోరాటం ముగింపునకు ఊతమిస్తుంది. స్వేచ్ఛ పొందేందుకు దోహదపడుతుంది. విజయానికి దగ్గరలో ఉన్నాం. గతంలో లేనంతగా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా, లాటిన్ అమెరికా ప్రజలపై ఆధారపడతాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు ప్రధాన మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్ణయాత్మక మద్దతు ఇస్తున్న అధ్యక్షుడు ట్రంప్‌నకు అంకితం చేస్తున్నా అని మరియా పేర్కొన్నారు. అంతకుముందు నార్వే నోబెల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ క్రిస్టియన్ బ్రెగ్ హార్ప్‌క్వెన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శాంతి పురస్కారాన్ని ఇవ్వనున్న విషయాన్ని ఆమెకు ముందుగానే తెలియజేశారు. నాకు ఈ పురస్కారం రావడం నమ్మలేకపోతున్నా. మాటలు రావట్లేదు. వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు. మేము సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాం. తప్పకుండా విజయం సాధిస్తాం. ఇదో ఉద్యమం అని మీరు అర్థం చేసుకున్నారని భావిస్తున్నా. అయితే, ఇది నా ఒక్కరి గెలుపు కాదు. వ్యక్తిగతంగా నేను దీనికి అర్హురాలిని కాదని అనుకుంటున్నా. ఇది సమాజం మొత్తం సాధించిన విజయం. మా ప్రజలకు లభించిన అతిపెద్ద గుర్తింపు అని మరియా కొరీనా పేర్కొన్నారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మరియా కొరీనాకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో ఆమె ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. ఏడాది కాలంగా అజ్ఞాతంలో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది.

## 2025 అక్టోబర్ 11, శనివారం తెలుగు పంచాంగం




మాసం -పక్షం
ఆశ్వయుజ మాసం
కృష్ణ పక్షం
తిథి
చతుర్థి: అక్టోబర్ 10 ఉదయం 1:34 అక్టోబర్ 11 ఉదయం 12:24 వరకు
పంచమి: అక్టోబర్ 11 ఉదయం 12:24 అక్టోబర్ 12 ఉదయం 11:36 వరకు
నక్షత్రం
కృతిక: అక్టోబర్ 10 ఉదయం 4:33 అక్టోబర్ 11 ఉదయం 5:11 వరకు
రోహిణి: అక్టోబర్ 11 ఉదయం 5:11 అక్టోబర్ 12 ఉదయం 6:13 వరకు
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:37 - 5:22
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:41 - 12:26
అమృతకాలం: మధ్యాహ్నం 12:18 - 1:52
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 9:06- 10:34
యమగండం: మధ్యాహ్నం 1:31 - 2:59
దుర్ముహూర్తం: ఉదయం 6:47
7:35, మధ్యాహ్నం 7:35 - 8:23
వర్జ్యం: రాత్రి 8:50 - 10:30

# గురుకుల పాఠశాలలో విద్యార్థి అనుమానాస్పద మృతి

## వివేక్ కుటుంబానికి న్యాయం చేయాలి -జాతీయ మాల మహానాడు



**హుస్నాబాద్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జిల్లెల్లగడ్డలోని సామాజిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సానాది వివేక్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై జాతీయ మాల మహానాడు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక మంత్రి, జిల్లా కలెక్టర్, ఏసీపీ, ఆర్డీఓలకు వినతిపత్రం అందజేశారు. వివేక్ మృతి హత్య అనుమానం అక్టోబర్ 7న ఉదయం క్లాస్‌రూమ్ వరండా వద్ద వివేక్ మృతదేహం కనిపించింది. సంఘటన స్థలం, శరీరంపై గాయాలు, ఉపాధ్యాయుల సమాధానాల్లో పొంతన లేకపోవడంతో తల్లిదండ్రులు హత్య అనుమానం వ్యక్తం చేశారు. ఫిర్యాదును పారదర్శకంగా, వేగంగా విచారించాలని కోరారు. యాభై లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం డిమాండ్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆరె కిశోర్ మాట్లాడుతూ "ఎన్నో ఆశలతో గురుకుల పాఠశాలలో చేర్పించిన విద్యార్థి, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటివరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఎలాంటి



చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి యాభై లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి" అని డిమాండ్ చేశారు. కమిటీ ఏర్పాటు, పర్యవేక్షణ చర్యలు అవసరం వివేక్ మృతిపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని, హాస్టళ్లలో భద్రతా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠశాలలోనే నివసిస్తూ విద్యార్థుల పట్ల నియంత్రణతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం "బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు ఆధ్వర్యంలో వివేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు: వెన్న రాజు (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), జాల శ్రీనివాస్ (జిల్లా మీడియా సెల్ ఇన్‌చార్జ్), దుంద్ర సుమన్, మ్యాకల శ్రీకాంత్, ద్యాగల సతీష్, వేరంగి సాయి, గుమ్మడి సాయి శ్రీరామ్, బిళ్ళం రాములు, బోజు కనుకయ్య, బోజు నాని, బిళ్ళం కళ్యాణ్, సానాదుల మాధవన్, పులి రవి, గద్దల రాకేష్, రాగుల కృష్ణ తదితరులు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన చిట్యాల తహసీల్దార్



**చిట్యాల, అక్టోబర్ 10( నీలగిరి ఎక్స్ ప్రెస్):** పట్టా భూమిని మ్యుటేషన్ చేయడానికీ, సర్వే నివేదికను పోలీసులకు పంపించడానికీ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ చిట్యాల తహసీల్దార్ గుగులోతు కృష్ణ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. మిస్టర్ రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వ్యవసాయ భూమిని మ్యుటేషన్ చేయాలన్న దరఖాస్తుపై చర్యలు తీసుకోవడంలో తహసీల్దార్ ఆలస్యం చేస్తూ, లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అలాగే మరో వ్యవసాయ భూమికి సంబంధించిన సర్వే నివేదికను చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపించేందుకు కూడా లంచం కోరినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ప్రైవేట్ వ్యక్తి గట్టు రమేష్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి, తహసీల్దార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, నిందితులను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. తహసీల్దార్ ఆస్తులపై కూడా విచారణ కొనసాగుతోంది.

# కాంగ్రెస్ వ్యవహార శైలిని ఎండగట్టిన జంగిలి యాదగిరి



**వెల్దండ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేశారు. బీసీ రిజర్వేషన్ నినాదం పేరుతో ప్రజలను మభ్యపెట్టి, 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి, జీవో నెంబర్ 9 ద్వారా బీసీలను నట్టేట ముంచిన మైనము తాజాగా వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. న్యాయవంచనతో హైకోర్టులో కేసులు వేయించి బీసీలకు అన్యాయం జరిగిందని, రాజ్యాంగ విరుద్ధంగా రిజర్వేషన్ హామీలు ఇవ్వడం రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన మొదటి తప్పుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసత్యాలతో కాలయాపన చేస్తూ, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిందని ఆరోపించారు. చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాల్సిన సమయంలో న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని హామీలు ఇవ్వాల్సి ఉండగా, రాజకీయ లబ్ధికోసం అమలు కాని హామీలు ఇచ్చారని విమర్శించారు. 42 శాతం బీసీ కోటా కోర్టులో నిలబడదని తెలిసినా, దూకుడు వ్యవహారంతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలిని ప్రస్తావిస్తూ, ఆయన ప్రజల కోసం ముఖ్యమంత్రి కాలేదని, ప్రజలను మోసం చేయడానికే ఆ పదవిలో ఉన్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 20 నెలలుగా స్థానిక ఎన్నికలు జరగకపోవడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపట్టిందని, అధికారుల పాలన వల్ల ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇకనైనా బీసీ నాయకులు మేల్కొని, కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులను ప్రజల ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ డ్రామా

## కాంగ్రెస్‌పై బీజేపీ ఘాటు విమర్శ



**కరీంనగర్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించామని చెప్పి చెల్లని జీవో తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, రాజ్యాంగబద్ధ ప్రక్రియను పక్కనపెట్టి డ్రామా చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. హైకోర్టు స్టేతో బీసీలకు నష్టం జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీసీలకు న్యాయంగా రావాల్సిన వాటిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ఓటు కోసం నాటకం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించినప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్ల పెంపు సాధ్యపడదని తెలిసీ, బీసీలను మోసం చేయడానికి నాటకానికి తెరలేపిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీల అమలు చేస్తామని చెప్పి, ఆరు నెలల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించి మోసం చేశారని ఆరోపించారు. చట్ట విరుద్ధంగా ఎన్నికల షెడ్యూల్ ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపినప్పటికీ, గడువు ముగియకముందే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం చట్ట విరుద్ధమని, ఇది ప్రభుత్వ దురుద్దేశాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. పారదర్శకత లేకుండా కులగణన కులగణన, బీసీ కమిషన్ నివేదికల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, ఇంటింటి సర్వే అడ్డదిడ్డంగా చేపట్టారని, ఇప్పటివరకు గణాంకాలు బహిర్గతం కాలేదని విమర్శించారు. బీహార్‌లో ఓట్లు, తెలంగాణలో మోసం బీహార్‌లో ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా, తెలంగాణ బీసీలకు చట్టబద్ధమైన న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని, సుప్రీంకోర్టు తీర్పును విస్మరించి ప్రజలను మోసం చేసిందని గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. ప్రతి ఎన్నికకు డ్రామా ప్రతి ఎన్నికకు ముందు కాంగ్రెస్ పార్టీ డ్రామాకు తెరలేపుతుందని, ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. 22 నెలలు గడిచినా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ప్రతీ రోజు కొత్త మాట, కొత్త డ్రామా కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు.

# బీసీలకు దయాకర్‌రావు చేసిందేమిటి..?


- -బీసీల గురించి దయాకర్‌రావు మాట్లాడడం హాస్యాస్పదం
- -నీ రాజకీయ జీవితంలో ఏనాడ్కైనా బీసీల గురించి కొట్లాడావా..?
- -బీసీలపై కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకిస్తే పుట్టగతులుండవ్
- -బలహీన వర్గాల గురించి దేశంలో పోరాటం చేస్తున్నదే కాంగ్రెస్22
- -బీసీల బిల్లుపై అసెంబ్లీలో మద్దతు...మండలిలో వ్యతిరేకించిది బీఆర్ఎస్
- -ముందు బీసీల రీజర్వేషన్లపై బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో తెలుసుకో
- -దయాకర్‌రావు వ్యాఖ్యలను బీసీ సమాజం విశ్వసించదు
- -యువజన కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్,మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం



**వర్ధన్నపేట, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీలకు దయాకర్‌రావు చేసిందేమిటని..? యువజన కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్,మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలపై కుల్ల యాకాంతం కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీల గురించి కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చి ప్రజల దీవెనలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఇచ్చిన హామీ అమలుకు బీసీలకు న్యాయం చేసేందుకు చట్టాలను గౌరవిస్తూ ఎలాంటి పరిస్థితుల్లో ఇబ్బందులు రాకుండా ఉండేందుకు కుల గణన మొదలుకుని కమీషన్ సహా అన్ని చర్యలు తీసుకున్న సంగతి దయాకర్‌రావు మరిచిపోయి మాట్లాడడం ఆయనకు బీసీల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కుల్ల యాకాంతం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేని దయాకర్‌రావు పిచ్చి పిచ్చిగా మాట్లాడితే నీ మాటలు నమ్మడానికి ప్రజలు ఎవరు సిద్ధంగా లేరని అన్నారు. గతం 3 దశాబ్దాలుగా నువు చేస్తున్న కుట్ర రాజకీయాలను భరించిన ప్రజలే ఎలాంటి రాజకీయ అనుభవం లేని వ్యక్తి చేతిలో నిన్ను ఓటమి పాలు చేసి ఇంటికి సాగనంపారనే విషయాన్ని మరిచి మాట్లాడితే రానున్న రోజుల్లో మరింత దిగజారి పోవడం ఖాయని అన్నారు. దయాకర్‌రావు రాజకీయ జీవితంలో అంత ఇంత అనుభవం అని చెప్పుకునే నువ్వు రాజకీయ జన్మనిచ్చిన పార్టీకి ద్రోహం చేసి మంత్రి పదవి సాధించిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు తెలిసిన విషయమేనని అన్నారు. నీ కుట్ర రాజకీయాలతో నీకంటే చిన్న వాడ్కైన రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదుగుతున్న తీరును ఓర్వలేక నువ చేసిన కుట్రలు ఎక్కడా ఫలించక నేడు ఆదే కుట్ర రాజకీయాలు ప్రజలకు తెలిసి నిన్ను ప్రజాక్షేత్రంలో లేకుండా చేశారని యాకాంతం అన్నారు.

బీసీలపై ప్రేమ ఒలకబోస్తున్న దయాకర్‌రావు ఏనాడ్కైనా రోడ్డుపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని పోరాడిన సంధర్భాలు ఉన్నాయా..? అని యాకాంతం ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీల కోసం వారికి న్యాయంగా దక్కాల్సిన రాజకీయ. ఉద్యోగ, విద్యపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై అవాకులు చెవాకులు పెలితే రానున్న రోజులు నిన్ను , నీ పార్టీని నామరూపాలు లేకుండా బీసీ సమాజం చేస్తుందనే విషయాన్ని మరిచి మాట్లాడితే తగిన పరిణామాలు తప్పవని అన్నారు. బీసీల రిజర్వేషన్ల గురించి ముందు బీఆర్ఎస్ చిత్తశుద్ధి ఏమిటో మీ అధిష్టానం దగ్గర తేల్చుకుని ప్రజల ముందు మాట్లాడితే బాగుంటుందని అంతేగాని అవకాశం వచ్చిందని కేవలం రాజకీయ విమర్శల కోసం బీసీల అంశాన్ని ముందు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీపై పనికిరాని వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. ఏనాటికైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. బీసీల రిజర్వేషన్లపై దొంగ ఏడుపు నటిస్తున్న బీజేపీ , బీఆర్ఎస్‌ల కుట్రలు ప్రజలు ఇప్పటికే గుర్తించారని రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి రెండు పార్టీలను రాష్ట్రంలో భూస్థాపితం చేయడం ఖాయమని కుల్ల యాకాంతం

# సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి






**ఆర్టీఐ సతీష్**

**హైదరాబాద్, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) సామాన్యుడికి కొండంత ధైర్యమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో అక్టోబర్ 09 గురువారం రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టీఐ వారోత్సవాల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్టీఐ అమలులోకి వచ్చి 20 ఏళ్లవుతున్న సందర్భంగా తెలంగాణ సమాచార కమిషన్ (టీజీఐసీ) హ్యాండ్ బుక్, న్యూస్ లెటర్ని ఆవిష్కరించారు. ఆర్టీఐ వారోత్సవాల సమావేశానికి ఆర్టీఐ రక్షక్ సంస్థ టీం సభ్యులు వివిధ జిల్లాల నుండి ఈ కార్యక్రమానికి హాజరవడం జరిగింది. వారిని ఉద్దేశించి ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్టీఐ సతీష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు, ప్రజలే పాలితులు. ప్రజలకే ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. సమాచార హక్కు చట్టం పాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచి, పారదర్శకతను, జవాబుదారీతనాన్ని అందిస్తుంది. ప్రజాస్వామ్య దేశాల్లో సమాచార హక్కు అనేది సామాన్యుడి చేతిలో వజ్రాయుధం. ప్రభుత్వ పాలన పారదర్శకంగా, జవాబుదారీతనంగా రూపొందడానికి, ప్రజలకు ప్రభుత్వ పని తీరు, విధానాలపై సమగ్రమైన అవగాహన కల్పించేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుంది. తద్వారా ప్రభుత్వ పాలనలో అవినీతి అక్రమాలు తొలగి దేశం ప్రగతిపథం వైపు పయనిస్తుంది. ప్రభుత్వ పాలనలో పారదర్శకత పెంపొందించి పరిపాలనా వ్యవహారాల్లో గోప్యతను నివారించి ప్రభుత్వ పాలన విధానాలను ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు పౌరులకు కల్పించిన అద్భుతమైన అవకాశమే సమాచార హక్కు. సమాచారాన్ని ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అయితే దాన్ని పొందడం పౌరుల హక్కు. ఇది ప్రభుత్వ పాలనలో బాధ్యతాయుత విధానానికి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు.అనంతరం రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ గారిని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్టీఐ రక్షక్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాష్ట్ర మహిళా శిశు రక్షణ అధ్యక్షురాలు సాత్విక రెడ్డి, రాపోలు లింగస్వామి, పగడల దేవయ్య, మామిళ్ళ సత్తిరెడ్డి, ఇప్పలపల్లి నరేందర్, లందగిరి సాయి, మరియు కండె వెంకట్, అఫ్తాబ్ అహ్మద్, సిలివేరు రమేష్, ఉదయ్, రోశనగరి యాదయ్య, బుగ్గ రాములు, అశోక్, వివిధ జిల్లాల నుండి కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# హైకోర్టు స్టేను వ్యతిరేకిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన

**కడ్తాల్, అక్టోబర్ 10 ( నిలగిరి ఎక్స్ ప్రెస్ ) :** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై హైకోర్టు జారీ చేసిన స్టే ఆదేశాలను తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే కి పుష్పాంజలి ఘటించి, ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు పేదల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని నేతలు పిలుపునిచ్చారు. బీసీలు దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వెన్నెముకలుగా ఉన్నారని, స్థానిక సంస్థలలో బీసీల ప్రాతినిధ్యం తగ్గించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. హైకోర్టు స్టే ఆదేశం



బీసీల రాజకీయ హక్కులను అణగదొక్కే చర్యగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సుప్రీంకోర్టులో అపీల్ చేసి, బీసీ రిజర్వేషన్లు కొనసాగించేలా తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బీసీలు ఓటు బ్యాంకులు కాదని, ఈ రాష్ట్రం యొక్క బలమని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరచిన సామాజిక న్యాయం సూత్రాలను కాపాడటమే మా ధ్యేయం అని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, గురీగళ్ల లక్ష్మయ్య, జహంగీర్ అలీ, సత్యం యాదవ్, మూడ రవి, మంగళపల్లి నరసింహ, క్యామ రాజేష్, రామచంద్రనాయక్, క్యామ శేఖర్, లాయక్ అలీ, పాండు నాయక్, రమేష్, శ్రీను, శ్రీశైలం, రాజేందర్ గౌడ్, భాను కిరణ్, రాజు, మహేష్, భూపాల్, యాదయ్య, చంద్రయ్య, షాబుద్దీన్, నరేష్, శ్రీకాంత్ గౌడ్, ఇక్బాల్ పాషా, సురేష్, శ్రీనివాస్, అంజి, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముద్విన్ లో బిజెపి పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

- అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రజాప్రభుత్వం లక్ష్యం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**కడ్తాల్, అక్టోబర్ 10 ( నిలగిరి ఎక్స్ ప్రెస్) :** కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామ బీజేపీ పార్టీ నుండి 25 మంది కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పికాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి తో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా చేస్తున్నారని ప్రజాప్రభుత్వం లో కల్వకుర్తి నియోజకవర్గం బాగా అభివృద్ధి చెందుతుందని,



ఇప్పటికే వందల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని రాబోవు రోజులో నియోజకవర్గం లోని అన్ని గ్రామాలు, తండాలు అభివృద్ధి చేస్తామని అన్నారు. పార్టిలో చేరినవారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి కాంగ్రెస్ పార్టీ లో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ , బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాట నర్సింహా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిచ్య నాయక్ , ముద్విన్ మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, సీనియర్ నాయకులు నక్కపోతు నర్సింహా, సురేందర్ రెడ్డి , రమేష్ , నర్సింహా, వెంకటేష్, ముద్విన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, పార్టీలో చేరిన నాయకులు సౌత సురేష్, పట్నం యాదయ్య, కానుగుల మహేష్, పుల్కారపు మహేష్, కావటి శేకర్ శివ యాదవ్, పుల్కారపు మల్లేష్, జంగం శివ పట్నం శ్రీకాంత్, కావటి రాజు, రామకృష్ణ, సుందూరి కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# అందరూ వీక్షించాల్సిన సినిమా 'అరి'

– మండిగ రాజనర్సయ్య

**ఎలిగేడు, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రానికి చెందిన హరి సినిమా డైరెక్టర్ వంగ జయశంకర్ రూపొందించిన 'అరి' సినిమా ప్రతి ఒక్కరూ తప్పక వీక్షించాల్సిన చిత్రమని ఎలిగేడు గ్రామ మాజీ సర్పంచ్ మండిగ రాజనర్సయ్య అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన గ్రామస్తులతో కలిసి ఈ సినిమాను వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవుని లోని అర్షద్వర్గాలను ఎలా జయించి, సత్పథంలో జీవించవచ్చో కళ్లకు కట్టినట్టు ఈ సినిమాలో చూపించారని ప్రశంసించారు. గతంలో వంగ జయశంకర్ దర్శకత్వం వహించిన 'పేపర్ బాయ్' సినిమాకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని గుర్తుచేశారు. 'అరి' సినిమాను కూడా ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన వెంట సీనియర్



ఎల్ఐసి ఉద్యోగి బూర్ల శశిధర్, గ్రామస్తులు కట్ల రాజ్ కుమార్, మహమ్మద్ రహీం, న్యాతరి సంపత్, కొంక శ్రీనివాస్, తిరుమల మహేందర్, తాటిపల్లి సతీష్ బాబు ఉన్నారు.

# వార్డ్ మెంబర్ కు కూడా అవకాశం ఇవ్వద్దు

ఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి,అక్టోబర్ 10 ( నీలగిరి ప్రెస్):** రానున్న స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీ జెడ్పీటీసీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలలో ప్రతిపక్షాలకు వార్డు సభ్యుడు గెలిచేందుకు కూడా అవకాశం ఇవ్వకుండా మనం కష్టపడాలని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు స్పష్టం చేశారు శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రం నుంచి రాకేష్, తన్వీర్ యువకుల ఆధ్వర్యంలో దాదాపు 40 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారుఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల BRS పాలనలో యువకుల భవిష్యత్తు ఒక ప్రశ్నార్థకంగా మారిందని ప్రతి నిరుద్యోగి తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నాడని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు నేడు ఇందిరమ్మ రాజ్యంలో యువకులకు ఉద్యోగ కల్పన, నోటిఫికేషన్లు, ఫీజు రియంబర్స్మెంట్ లాంటి అనేక చర్యలు చేపట్టిన నివాళులు పేర్కొన్నారు

కాంగ్రెస్ పథకాలు వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పనితీరు నచ్చితాము బీఆర్ఎస్ పార్టీలో నుంచి కాంగ్రెస్లో చేరుతున్నట్లు తెలిపారు

కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సత్య రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, జిల్లా యూత్ అధ్యక్షులు వారికి ఆదిత్య, టైలర్ రవి రియాజ్ ,రాఘవేందర్ , రామాంజనేయులు బుచ్చన్న, వెంకటస్వామి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అండర్ 17క్రీడల లో అద్భుత ప్రతిభ





**వనపర్తి, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి పట్టణంలోని మాస్టర్ మైండ్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్. కో–కో టోర్నమెంట్‌కు ఎంపిక కావడం పాఠశాల గర్వకారణంగా మారింది.అండర్–17 విభాగంలో జీ. రుద్ర, సి. సాయి ప్రియ, అలాగే అండర్–14 విభాగంలో పి. అకుల్ మెల్విన్, ఎం. జయశ్రీ, బి. వైశాలిలు అద్భుత క్రీడా నైపుణ్యంతో ఎంపిక అయ్యారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. గౌతం కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం. రమేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందిస్తూ, "వారి కృషి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పాఠశాలకు గర్వకారణం. భవిష్యత్‌లో రాష్ట్ర స్థాయిలోనూ విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాం" అని.విద్యార్థుల విజయంతో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

# హర్యానాలో దళిత ఐపీఎస్ మరణం కులవివక్ష రూపంలో అగ్రకుల ఆధిపత్య హత్యే

- దోషులను కఠినంగా శిక్షించాలి సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలని కేవీపీఎస్ డిమాండ్



**నల్లగొండ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
'రాజ్యాంగ విలువలను ముంచేస్తున్న కులవివక్ష!"
దళిత ఐపీఎస్ మరణంపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపి న్యాయం చేయాలని శుక్రవారం పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. బీజేపీ–ఆర్ఎస్ఎస్ మనువాదం సమాజాన్ని విషపూరితం చేస్తోంది"దళిత ఐపీఎస్ పోరన్ కుమార్ మరణం దేశ ప్రజాస్వామ్యానికి గాయం అని హర్యానాలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఐపీఎస్ ఆఫీసర్ పోరన్ కుమార్ కుల వివక్ష అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇదీ ముమ్మాటికీ అగ్ర కుల ఆధిపత్య హత్యేనని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శిపాలడుగు నాగార్జున ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక ఐపీఎస్ ఆఫీసర్ స్థాయిలో ఉన్న దళితుడికే ఇంత అవమానం జరిగితే సామాన్య దళితుడు పరిస్థితి ఏంటి, దళితులకు సామాన్యులకు జరుగుతున్న అన్యాయానికి ఇది నిదర్శనం. అని పేర్కొన్నారు. దేశంలో నేడు బిజెపి ఆర్ఎస్ఎస్ మనువాద సిద్ధాంతం పేరుతో సమాజాన్ని విషతుల్యం చేస్తున్నాయని దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని వారు పిలుపునిచ్చారు. ఐపీఎస్ మృతి పట్ల సిట్టింగ్ న్యాయమూర్తి చేత తక్షణమే విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

# బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలి

**- కంబాల పెల్లి భాస్కర్**



**మంచాల, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల మండల ఆఫీస్ సమీపంలోని రహదారిపై బీసీ, ఎస్సీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కంబాల పెల్లి భాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం కొంతమంది స్వార్థపరులు హైకోర్టులో పిటిషన్ వేసి బీసీలకు నోటి కాడి బుక్క అదరగొట్టి ఎన్నికలను నిలిపివేయడం అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన విధంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని, గతంలో 27 శాతం రిజర్వేషన్ ఉన్న బీసీలు ప్రస్తుతం జనాభాలో 70 శాతం ఉన్నప్పటికీ 42 శాతం రిజర్వేషన్ అడిగితే వ్యతిరేకించడమేమిటని ప్రశ్నించారు. బీసీలలో ఐక్యత లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలిసి రాజ్యాధికార దిశగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ప్రస్తావిస్తూ, 15 శాతం జనాభా ఉన్న వారికి 10 శాతం రిజర్వేషన్లు కేంద్రం 2019 జనవరి 8న ఆమోదించి, 9న లోక్‌సభలో ప్రవేశపెట్టి, 10న రాజ్యాంగ సవరణగా ఆమోదించి, 14న అమలులోకి తీసుకురావడం గమనించదగ్గ విషయమని తెలిపారు. ఎలాంటి పోరాటం లేకుండానే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలయ్యాయని, బీసీలు 42 శాతం వాటా అడిగితే దాన్ని కోర్టులో ఆపడం ద్రోహమేనని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అశ్వాల బాలరాజ్, చిందం శ్రీశైలం, వంగల కృష్ణ, మొగిలి మహేష్, పసుల కృష్ణయ్య, మల్గా లింగం, మొగిలి శ్రీశైలం, శివరాల పాండు, పొట్టి యాదయ్య, గజ్జి ఐలయ్య, సత్తయ్య, మంకు వినోద్, ఎర్పుల మల్లేష్, గడ్డం రాజేష్, చంద్రయ్య గౌడ్, లింగం కుర్ర రాజు, గ్యార పాండు, జోగు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన




**ఎలిగేడు, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పట్ల ఎలిగేడు మండల కేంద్రంలో బిజెపి పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గర్రెపల్లి నారాయణస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కేటాయింపుకు బిజెపి పార్టీ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్తిరెడ్డి వేణుగోపాలరెడ్డి, మండల నాయకులు అడ్డగుంట తిరుపతి, మల్లారపు అంజయ్య, ఇల్లందుల పర్శరాములు, బోగే కిరణ్, చిట్టి వేణి రాజకుమార్, ఎల్క శంకర్, కోడూరి శ్రీనివాస్, ఊర జగన్నాథ్ రావు, గడ్డం సతీష్ రెడ్డి, బద్దం మల్లారెడ్డి, అసంపల్లి రవి, మద్దపల్లి నారాయణ, కోట కనుకయ్య, రంగు మణికంఠ, మాడపు రాకేష్, రెచవేణి రమేష్, పూరేళ్ళ శరత్ గౌడ్, మ్యాడారవేణి రవీందరు, తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం యధా విధంగా ప్రజావాణి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎంపిటిసి, జెడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర హై కోర్ట్ ఆదేశాలమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసినందున ఈనెల 13 (సోమవారం) న ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల సమస్యల పరిస్కారం నిమిత్తం ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించదల్చుకున్న వారు సోమవారం వారి దరఖాస్తులను నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సమర్పించవచ్చని ఆమె స్పష్టం చేశారు .జిల్లా ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# తెగిపోయిన పేరూరు వంతెనను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన హాలియా మండలం, పేరూరు వంతెన తాత్కాలిక పునరుద్ధరణకు అంచనాలు రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డితో కలిసి పేరూరు గ్రామ శివారులో తెగిపోయిన వంతెనను పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్తులతో వివరాలను అడిగి తెలుసుకున్న తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ వంతెన తెగిపోవడం వల్ల ప్రజల రవాణాకు, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే తాత్కాలిక చర్యలు చేపట్టాలని,ఇందులో భాగంగా పేరూరు వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించాలని, అలాగే శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు కాగా 40 సంవత్సరాల కు పూర్వం నిర్మించిన ఈ వెస్టడ్ కాజ్ వే పై అటువైపు నుండి మదారి గూడెం, ఇటువైపు పేరూరు గ్రామాలను కలుపుతుంది .అయితే చుట్టుపక్కల ఉన్న ఏడేనిమిది గ్రామాల ప్రజలు కూడా ఈ వంతెన తెగిపోవడం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి రాగా ,ఆమె స్థానిక శాసనసభ్యులతో కలిసి వంతెనను పరిశీలించి తక్షణ చర్యలకు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం హాలియా తహసిల్దార్ కార్యాలయంలో ఇదే విషయంపై మరోసారి శాసన సభ్యులతో కలెక్టర్ చర్చించారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాత్కాలిక వంతెనకు తక్షణ చర్యలు చేపట్టాలని శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేందర్, డి ఈ సతీష్,ఏ ఈ సాయి రెడ్డి,మున్సిపల్ కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి,తహసిల్దార్ రఘు, ఎంపీడీవో సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**- ఆదిపత్యశక్తుల కుట్రలను తిప్పి కొడతాం**



**నల్లగొండ ,అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో గల రైల్వే ట్రాక్ వద్ద రాస్తారోకో నిర్వహించడం జరిగింది జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి కళాశాలలు పాఠశాలలు బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ జనాభా తమాషా ప్రకారం బీసీలకు 42 శాతం కల్పిస్తూ జీవోలు చేసి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. దాన్ని జీర్ణించుకోలేని కొన్ని అగ్రవర్ణాల శక్తులు కోట్ల కేసులు వేసి బీసీలకు 42% రిజర్వేషన్లు రాకుండా అడ్డుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# పంటలు సందర్శించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



**అబ్దుల్లాపూర్ మెట్టు. అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండల లోని తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలకి సంబంధించిన కార్యక్రమం గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ సునీత శ్రీనివాస్ రెడ్డి సంబంధిత వ్యవసాయ అధికారి పల్లవి రైతులతో సమావేశం శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ వ్యవసాయంలో ముఖ్యంగా వరి పంటలో ఎలుకల నియంత్రణ గురించి అలాగే పంట మార్పిడి గురించి వివరించడం జరిగింది. తర్వాత శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరి పంటలో యూరియా వాడే విధానం గురించి అలాగే పుటేష్ తర్వాత శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వరి పంటలో యూరియా వాడే విధానం గురించి అలాగే పొటాష్ వాడే విధానం గురించి రైతులకి తెలియజేయడం జరిగింది. రైతులు ఈ సంవత్సరం యూరియా వాడకాన్ని 25% వరకు తగ్గించినట్టు తెలియజేశారు. రైతులు ఈ వర్షాకాలంలో జీలుగా జనుము సాగు చేసినట్టుగా తెలియజేశారు దీనివల్ల యూరియా వాడకాన్ని తగ్గించినట్టుగా చెప్పారు. తదనంతరం వ్యవసాయ అధికారి పల్లవి మాట్లాడుతూ సబ్సిడీలో రోటవేటర్ బ్యాటరీ స్ప్రేయర్స్ అందుబాటులో ఉన్నాయని రైతులకి తెలియజేశారు. ఈ సమావేశానికి మొత్తం 45 మంది రైతులు పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమం తర్వాత శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు విశ్వవిద్యాలయం అందించిన నాణ్యమైన విత్తనంకు సంబంధించిన రైతు పొలాలని సందర్శించిటం జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం వైస్ ఛైర్మన్ రామ్ రెడ్డి. అబ్దుల్లాపూర్ మెట్ మండల వ్యవసాయ విస్తరణ అధికారి రఘుపతి. రైతులు ఎస్ జంగారెడ్డి. ఎస్ బాల్ రెడ్డి. కృష్ణారెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు తదితరులు

# విద్యుదాఘాతంతో గేదెలు మృతి



**దేవరకొండ అక్టోబర్ 10.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** విద్యుదాఘాతానికి గురైన రెండు గేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున డిండి మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే డిండి మండలం పరిధిలో రామంతపూర్ గ్రామానికి చెందిన తూం పద్మ కు చెందిన గేదెలు వ్యవసాయ పొలంలో మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగల తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై రెండు గేదెలు మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ దాదాపు 90 వేలు ఉంటుందని బాధిత రైతు పద్మ తెలిపారు.

# షాద్ నగర్ అభివృద్ధిపై దృష్టి సారించండి

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రోజురోజుకు వేగంగా అభివృద్ధి చెందుతున్న షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిని పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎంత నిధులైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ ద్వారా రూ.10 కోట్ల నిధులు విడుదలైన నేపథ్యంలో, కొత్త కాలనీల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని నూతన కాలనీల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి అనేక దశలవారీగా నిధులు విడుదల చేస్తోందని, పట్టణ ప్రగతికి కృషి కొనసాగుతోందని తెలిపారు. సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, సిబ్బంది సహకారంతో పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొత్త కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అవసరమైన చర్యలు త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ చేతుల మీదుగా ....

# సోషల్ వెల్ఫేర్ నూతన పాలకవర్గం ధ్రువపత్రాల అందజేత...





**హైదరాబాద్, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ తెలంగాణ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గానికి ఇటీవల ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. కొత్తపేట్ లోని బీజేఆర్ భవన్ లో గత నెలలో 13 తేదీన జరిగిన ఎన్నికలలో విజయం సాధించిన నూతన పాలకవర్గానికి గుర్తింపునిస్తూ టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, కార్యదర్శి ముజీబ్ చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ ను రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ గురువారం సాయంత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీఎన్జీవో సిటీ ప్రెసిడెంట్ కే.శ్రీకాంత్, మీడియా ఇంచార్జ్ మహేందర్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ లు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మినిస్టీరియల్ సిబ్బందికి అండగా ఉంటామన్నారు. నూతన కార్యవర్గం మినిస్టీరియల్ ఉద్యోగుల హక్కుల కోసం పాటుపడాలని సూచించారు. నూతన కార్యవర్గ ధ్రువ పత్రాలు అందుకున్న సందర్భంగా మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని వారు జగదీశ్వర్, ముజీబ్, శ్రీకాంత్ అభినందించారు. ...

**నేడు.. కరీంనగర్ లో ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ కార్యవర్గ తొలి సమావేశం...**

కరీంనగర్ లోని టీఎన్జీవోస్ భవన్ లో ఎస్సీడిడి మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ తొలి కార్యవర్గ సమావేశం జరగనున్నది. రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గం హాజరుకానున్నది. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి యువి.అరవింద్ కుమార్ ఎజెండా నివేదికను సమర్పించనుండగా కోశాధికారి కే.జీవన్ వ్యయపట్టికను కార్యవర్గానికి సమర్పించనున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సంపత్ కుమార్ స్వాగతం పలకనున్న ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణ్ రావు, టిఆర్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, నేషనల్ స్టాటిస్టిక్స్ కార్యాలయము,మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా గోవర్ధన శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొననున్నారు.

# ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ 11వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

**– కరపత్రాన్ని ఆవిష్కరించిన దేవరకొండ ఆర్.డి.ఓ రమణారెడ్డి.. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.బుర్రి వెంకన్న.**




**దేవరకొండ అక్టోబర్ 10.(నీలగిరిఎక్స్ ప్రెస్).** హైదరాబాదులోని శాంతి చక్రా లో ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ చేత స్థాపించబడిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ 11వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 19వ తారీఖున హైదరాబాదులోని శాంతి చక్ర బిల్డింగ్ మూడో అంతస్తుల జరుగుతున్నందున ఈ యొక్క మహా సభలను దళిత సంఘాలు బహుజన సంఘాలు ప్రజా సంఘాలు మహిళా సంఘాలు విద్యార్థిని విద్యార్థులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర మహాసభ కరపత్రికను నల్గొండ జిల్లా దేవరకొండ ఆర్.డి.ఓ.రమణారెడ్డి. ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి. డా.బుర్రి వెంకన్న,చేతుల మీదుగా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. బుర్రి వెంకన్న మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ చేత స్థాపించబడిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ మహత్తర సామాజిక స్వతంత్ర చట్టబద్ధత కలిగిన సమస్త అన్ని వర్గాల వారికి సమన్యాయం కోసం భారత రాజ్యాంగ హక్కుల సాధనకోసం కోసం పనిచేసే ఈ సామాజిక ఉద్యమ సమస్త ప్రజల హక్కుల రక్షణను కోరే మహోత్తర కార్య కరపత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషకరమని, భారత రాజ్యాంగ హక్కులను ప్రతి పౌరునికి భారత రాజ్యాంగంలో కల్పించినటువంటి హక్కులను పరిరక్షించే శక్తి గల సుశిక్షితులైన దళ్ కార్యకర్తలతో నవ సమాజ నిర్మాణం కోసం పరితపించే స్వాతంత్ర సామాజిక ఉద్యమంగా భావించి ప్రతి పౌరుడు నడుం బిగించి భారత రాజ్యాంగం పరిరక్షించుకోవడం కోసం మహనీయుల ఆశయాలను సాధించుట కోసం ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ అంబెడ్కర్ చేత స్థాపించిన బడిన ఉద్యమానికి మద్దతున్నిచ్చి, శక్తివంతమైన దళ్ నేతలకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షిస్తూ తెలియజేశారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దళిత రత్న డాక్టర్ బుర్రి వెంకన్న తో పాటు నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములు కొండమల్లేపల్లి మండల కన్వీనర్ మేదారి ప్రసాద్ ,పీఏ పల్లి మండల ఉపాధ్యక్షులు చేపూరి లక్ష్మయ్య, కొత్త మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**– బీసీలకు న్యాయం చేయడంలో రేవంత్ రెడ్డి విఫలం.**

**– ఓట్లు మావే రాబోయే రోజుల్లో రాజ్యాధికారం మాదే.**

**– ఎల్బీనగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నిప్పుపెట్టిన టి ఆర్ పి నాయకులు.**

**ఎల్బీనగర్ చౌరస్తాలో బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిరసన.**



**ఎల్బీనగర్ అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఎన్నో దశాబ్దాలుగా ఈ దేశంలో రాష్ట్రంలో బీసీలు వెనకబడిపోయారని, రాష్ట్రంలో మెజార్టీ ప్రజలైన బీసీలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారని, బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా, బీసీలను చట్టసభలకు పంపించడమే కోసమే తీన్మార్ మల్లన్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటు చేసారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్, వట్టే జానయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగం సూర్యరావు, రాష్ట్ర నాయకులు బందారపు నర్సయ్య గౌడ్ తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు ఈరోజు ఎల్బీనగర్ లో రాష్ట్ర యువ నాయకుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్వహించడం జరిగింది. తొలుత చౌరస్తాలో బైఠాయించి అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఉన్న పేపర్లను తగలబెట్టి , రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ తక్షణమే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలంటూ రోడ్డుపై బైఠాయించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి బీసీలకు 42% రిజర్వేషన్ తేవడంలో పూర్తిగా విఫలమయ్యాడని, ఆయన తెచ్చినటువంటి ఏదైతే జీవో ఉందో ఆ జీవో నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాదని గతంలోనే మల్లన్న చెప్పడం జరిగిందని, అది నేడు అక్షర సత్యం అయిందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసేందుకు ఈ 42 శాతం రిజర్వేషన్ ను తప్పుల తడకతో తీసుకువచ్చారని దీని కేవలం బీసిలను మభ్య పెట్టడం కోసమే ఇది జరిగిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే జీవో 9 ను సవరణలు చేసి బీసీలకు విద్య, ఉద్యోగాలలో అదేవిధంగా రాజకీయ పార్టీలలో సముచిత స్థానం దక్కే విధంగా కృషి చేయాలని హితవు పలికారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి కి ఒక చెంపపెట్టు లాంటిదని అన్నారు. రాబోయే కాలంలో ఓట్లు మావే, సీట్లు కూడా మావే అవుతాయని జోష్యం చెప్పారు. 2028 లో రాబోయే శాసనసభకు జరగబోయే ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికారం పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర యువ నాయకులు లింగం యాదవ్, కిరణ్ ముదిరాజు, పాకాల నరసింహ, ఖమ్మంపాటి రమేష్, రూపాని రాజా, కోట్ల వసుదేవ్, మహమ్మద్ ఖదీర్, జన మౌని అంజన్ కుమార్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.


## బోడుప్పల్ అభివృద్ధికి మరో ముందడుగు



**బోడుప్పల్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మేడ్చల్ నియోజకవర్గంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. 3వ డివిజన్ సాయి రెసిడెన్సీ నుండి 28వ డివిజన్ బంగారు మైసమ్మ గుడి వరకు రూ.10 కోట్ల నిధులతో చేపట్టనున్న 60 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులకు శుక్రవారం ప్రారంభం జరిగింది. ఈ పనులను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను మేయర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు 6 నెలల గడువులో ఏమి చేస్తారని కొందరు ఎద్దేవా చేసినా, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే వారికి సమాధానమని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు.బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధికి మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో ఘట్కేసర్ వైపు నుండి మల్లాపూర్, నాచారం దిశగా ప్రయాణించే వాహనదారులకు ప్రయాణం సులభతరం కానుందని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, సుమన్ నాయక్, చీరాల నర్సింహా, రాములు, పులకండ్ల జంగా రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ రంగా బ్రాహ్మన్న గౌడ్, కుర్రి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ






**దేవరకొండ అక్టోబర్ 10.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా డిండి మండలం కేంద్రంలో స్థానిక పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ ఇండియాలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఉపాధ్యాయులకు మండల రిసోర్స్ పర్సన్స్ కోదండ రామారావు, రమా మైసొల్ల, చింత బిచ్చయ్య , మూడు మండలాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులు శిక్షణ అందించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ మండల విద్యాధికారి ఐ .గోప్యనాయక్ ఆధ్వర్యంలో, సెంటర్ ఇన్చార్జ్ కళాశాల ప్రిన్సిపాల్ దోమ నారాయణరెడ్డి సమక్షంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుల కు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ , కోడింగ్ , డేటా అనలాసిస్ పై శిక్షణ ఇచ్చారు.సాంకేతిక విద్యను నేర్చుకొని విద్యార్థులకు నేర్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ పై కఠినచర్యలు తీసుకోవాలి



**దేవరకొండ అక్టోబర్ 10.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** మహ్మద్ ప్రవక్త పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ముస్లింల మనోభావాలు గాయపరచిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ పై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జమియత్ – ఏ – ఉలేమా, ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో స్థానిక సిఐ పి వెంకట్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత పెద్ద ముఫ్తి జావిద్ హుస్సేన్ మాట్లాడుతూ భారత దేశం శాంతికి చిహ్నం లాంటిదని, మత సామరస్యానికి నిలయం అని పేర్కొన్నారు. రాజకీయ లబ్ది కోసం మత చిచ్చు పెట్టి, తాత్కాలిక ప్రయోజనాలు పొందొచ్చు తప్ప అవి శాశ్వతంగా ఉండవన్నారు. మహ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు మమ్ములను బాదించాయని, ఈ వ్యాఖ్యలు బేషరతుగా ఉపసంహరించుకోవాలని, అదేవిధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై హిందూ ముస్లిం ల మధ్య విభేదాలు సృష్టించే వారిపై కఠినాతి కఠినమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందులో భాగంగానే దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్, ఇస్లాయే ముఆశరా కమిటీ అధ్యక్షులు ఖాజమైనుద్దీన్, మహ్మద్ ఇలియాస్ పటేల్, యండి అలీముద్దీన్, యండి కమాల్, యండి అతీఖ్,యండి జాఫర్ ఖాన్, మహ్మద్ సైఫ్, ఇలియాస్ బాబా, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించిన

**- యంగ్ ఎంటర్‌ప్రెనర్ అవార్డు గ్రహీత,పీహెచ్ఎస్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత పడిదల నవీన్ కుమార్**



**నర్సంపేట, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డిని యంగ్ ఎంటర్‌ప్రెనర్ అవార్డు గ్రహీత,పీహెచ్ఎస్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత పడిదల నవీన్ కుమార్ పరామర్శించారు.నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.శుక్రవారం కాంతమ్మ చిత్రపటానికి వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తో కలిసి యంగ్ ఎంటర్‌ప్రెనర్ అవార్డు గ్రహీత, పీహెచ్ఎస్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అధినేత పడిదల నవీన్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే దొంతిని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్,కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**




**మిర్యాలగూడ, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అగ్రికల్చర్ అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, రాబోయే ఖరీఫ్ పంట గతంతో పోలిస్తే అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు నష్టపోకుండా, న్యాయమైన ధరకు ధాన్యం విక్రయించేలా వ్యవస్థను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అలాగే అగ్రికల్చర్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రైతులకు అండగా ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రతి స్థాయిలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వార్షికోత్సవం








**యాచారం అక్టోబర్ 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి లో ఆర్య వైశ్య కుల దైవం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా గణపతి పూజ అమ్మవారికి పంచామృత అభిషేకం కుంకుమార్చన ... హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు కొండూరు శ్రీకాంత్ గుప్త , ఆర్యవైశ్య సంఘ సభ్యులు కొండూరు . అంజయ్య గుప్త,మచికంటి చంద్రశేఖర్ గుప్త మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్ కు చిత్తశుద్ధి లేదు

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్.వన్నాల వెంకటరమణ**



**వరంగల్, అక్టోబర్ 10(నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్.వన్నాల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు మళ్లీ అన్యాయమే జరిగిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అందరి ముందు నేను నిన్ను కొట్టినట్టు నటిస్తా... నీవు ఏడ్చినట్టు నటించు అన్నట్లు ఉంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీరు అన్నారు.బీసీ సమాజంతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకలాడుతుందని, ఇప్పటికైనా బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామా చేయాలన్నారు.గురువారం బీసీ రిజర్వేషన్ల జీవోను స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ అమలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసే విషయం సీఎం రేవంత్ రెడ్డికి,రాష్ట్ర మంత్రులకు ముందే తెలుసు. కావాలనే తెలంగాణ ప్రజలతో నాటకాలు ఆడుతూ ఎన్నికల పేరుతో కాలయాపన చేస్తూ పబ్బం గడుపు కుంటు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను దాటవేస్తుందని మండిపడ్డారు.భారతదేశ చరిత్రలో సుప్రీంకోర్టు, హైకోర్టు నోటిఫికేషన్ వచ్చిన తర్వాత స్టే ఇచ్చిన దాఖలలు ఎప్పుడు లేదని మొట్ట మొదటి సారిగ అది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డి కే దక్కిందని అన్నారు.60 సంవత్సరాలు ఈ దేశాన్ని పరిపాలించినటువంటి కాంగ్రెస్ పార్టీ, బీసీల మీద ఎప్పుడు ప్రేమ,చిత్తశుద్ధి చూపలేదు.బీసీలు అంటే ఒక ఓటర్లుగా చూసింది తప్ప వాళ్ళ అభివృద్ధికి పాటుపడలేదు.భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే బీసీల కు అండదండగా ఉంటూ బీసీలలో సామాజిక ఆర్థిక రాజకీయ చైతన్యం తీసుకువచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ బీసీల జపం చేస్తుంది.బీసీలను రాజకీయంగా ఆర్థికంగా అణగదొక్కడం కోసమే ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎలక్షన్ల పేరుతో ఒక డ్రామా చేస్తుంది. మీకు దమ్ముంటే చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ 42 శాతం ప్రకారం బీసీ ఎమ్మెల్యేలను, బీసీ మంత్రులను చెయ్యండి. అప్పుడు తెలంగాణ ప్రజలు మిమ్మల్ని నమ్ముతారు తప్ప ఇట్లాంటి డ్రామాలకు బీసీలు విచ్చిన్నం కారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేసి బీసీనీ ముఖ్యమంత్రి చేయాలన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పై న్యాయస్థానం స్టే ఇవ్వడం సరికాదు నోటిఫికేషన్ ఉన్న నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేయద్దు సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న స్టే విధించడం బీసీ హక్కులను కాల రాసింది కాంగ్రెస్ ప్రభుత్వం రెండు, మూడు రోజులు సమగ్రంగా విచారించాల్సి ఉన్నప్పటికీ హడావిడిగా ఎందుకు తీర్పు ఇచ్చారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టును ఆశ్రయించి న్యాయపరమైన లొసుగులు సవరణలు చేసుకొని ఎన్నికలు అదే సమయానికి సజావుగా జరిగేటట్టు చూసి తెలంగాణ ప్రభుత్వం ప్రజల యొక్కవిశ్వాసాలను, ప్రతిష్టను, హుందాతనాన్ని కాపాడాలన్నారు.బీసీ లంతా ఈ సమయంలో కలిసికట్టుగా ఈ ప్రభుత్వం మీద పోరాడి మన రిజర్వేషన్లు సాధించుకోవాలని పొన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు.

# ఘనంగా ఉప్పరి శేఖర్ సన్మాన కార్యక్రమం




**హైదరాబాద్, అక్టోబర్ 10 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ అమెరికా కాలిఫోర్నియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా ఘన సన్మానం జరిగింది. హైదరాబాద్ గచ్చిబౌలి అంజయ్య నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో కల్వకుర్తి, అచ్చంపేట సగర సంఘాల నాయకులు ఉప్పరి శేఖర్‌ను పూలమాల వేసి, శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శేఖర్ రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చెందుతూ సగర సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. విద్యా, సామాజిక రంగాల్లో ఆయన చేసిన కృషికి ఈ సన్మానం గర్వకారణమని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడకంటి వివేకానంద, జిల్లా ఇంఛార్జి మోడల ఆంజనేయులు, ముఖ్య సలహాదారులు వావిలాల భీమయ్య, ప్రధాన కార్యదర్శి వేముల సుధాకర్, కోశాధికారి పడకంటి రాజు, ఉపాధ్యక్షులు వావిలాల మురళీధర్, గంగాపురం తిరుపతయ్య, వేముల తిరుపతయ్య, సంయుక్త కార్యదర్శి కొల్లె దామోదర్, అచ్చంపేట కన్వీనర్ బండపల్లి వెంకటయ్య, మండల అధ్యక్షులు సూర్యనారాయణ, ప్రచార కార్యదర్శులు శ్రీశైలం, గుంటి తిరుపతయ్య, కల్వకుర్తి మండల అధ్యక్షులు వావిలాల సురేష్, కోశాధికారి వావిలాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు రొట్టె రాజు, గౌరవ అధ్యక్షులు షేగూరి యాదయ్య, కార్యదర్శి కల్లెపల్లి జంగయ్య, కోశాధికారి వావిలాల యాదగిరి, ఊరుకొండ మండల అధ్యక్షులు ఇంద్రాల సుధాకర్, కల్వకుర్తి మండల ఉపాధ్యక్షులు రొట్టె కృష్ణయ్య, యువజన ప్రధాన కార్యదర్శి శేగూరి నరేష్, కోశాధికారి మెరుగు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


# మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు ఉద్యమం



**తెల్కపల్లి అక్టోబర్ 10 ( నీలగిరి ఎక్స్ప్రెస్)** తెల్కపల్లి మండల పరిధిలోని, కర్వంగా గ్రామంలో కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ,కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చలేదని, ఈ పథకాల ద్వారా ప్రజలకు బాకీ ఉన్న డబ్బులను కాంగ్రెస్ బాకీ కార్డు రూపంలో ప్రజలందరికీ చేరవేయాలని బి ఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నయవంచక హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు "కాంగ్రెస్ బాకీ కార్డు ఉద్యమం" ను నాగర్ కర్నూల్ నియోజకవర్గం వ్యాప్తంగా విస్తృతంగా చేపడతామని అన్నారు.మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని గద్దె నెక్కింది అని తెలిపారు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్ని అమలు చేస్తాం అని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి వేదికలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డులను పంచి ప్రజలను మభ్యపెట్టి అధికారం లోకి వచ్చింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తుంది కానీ ఏ ఒక్క హామీ కుడా సక్రమంగా అమలు చేయలేదు.పథకాల అమలు తక్కువ ప్రచారం ఎక్కువ అన్న తీరు ప్రజల్లో పక్కదారి పట్టించింది. ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేస్తాం అంటూ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా గ్యారంటీ కార్డు లు ఇచ్చి మోసం చేసిందో ప్రజలకు వివరిస్తాము.ప్రతి మహిళకు 2500 ఇస్తామని కాంగ్రెస్ హమీ ఇచ్చింది కానీ, ఇప్పటి వరకు అమలు కాలేదు.22 నెలలుగా 2500 చొప్పున 55000 కాంగ్రెస్ ప్రతి మహిళకు బాకీ పడింది.వృద్దులకుపెన్షన్ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే 4000 పెన్షన్ చేస్తాం అన్నారు. కానీ కేసీఆర్ ఇచ్చిన 2000 మాత్రమే ఇస్తున్నారు. 22 నెలలుగా వృద్ధులకు బీడీ పెన్షన్ దారులకు కాంగ్రెస్ 44,000 బాకీ పడింది.దివ్యంగులకు పెంచుతామన్న 6000 పెన్షన్ అమలు చేయక ప్రతి దివ్యంగునికి 22 నెలల్లో 44,000 కాంగ్రెస్ బాకీ పడ్డది.రైతు భరోసా 15,000 చొప్పున రైతులకు,కౌలు రైతులకు 14 నుండి 19 వేలు, రుణమాఫీ 2,00,000 బాకీ ఉంది బోనస్ ప్రతి ఎకరాకు 12,500 చొప్పున నాలుగు పంటలకు 50,000 రైతుకు కాంగ్రెస్ బాకీ పడింది.విద్యాభరోసా కార్డు 5,00,000 ఇస్తామన్నారు ఇవ్వలేదు.ఉపాధి హామీ కూలీలకు, ఆటో డ్రైవర్లకు సంవత్సరం కు 12,000 చొప్పున రెండు ఏండ్లకు 24,000 కాంగ్రెస్ బాకీ ఉంది.విద్యార్థులకు 2 లక్షల ఉద్యోగాలు, 22 నెలలుగా ఇవ్వని నిరుద్యోగ భృతి 88,000 కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డదిఇప్పటి వరకు పెళ్లిళ్లు అయినా ఆడబిడ్డలకు తులం బంగారం, విద్యార్థులకు స్కూటి లు, ఫీజు రియంబర్స్మెంట్ 8000 కోట్లు కాంగ్రెస్ పార్టీ బాకీ పడింది.BRS పార్టీ ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ పథకాలు ద్వారా ప్రజలకు ఎంత బాకీ పడిందో తెలిసేలా కాంగ్రెస్ బాకీ కార్డు లను ప్రజలకు వివరించడం జరుగుతుంది. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజల్లోకి విస్తృతంగా ఒక ఉద్యమంగా తీసుకెళ్లాలి. ప్రజలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని, వివరిస్తూ అవగాహనా కల్పించాలి కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి విద్యార్థిని చదువుకు తెలంగాణ జాగృతి అండ



**హైదరాబాద్,అక్టోబర్ 10 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)** పేదింటి విశ్వకర్మ కార్మిక కుటుంబానికి తెలంగాణ జాగృతి అండగా నిలిచింది. హైదరాబాద్ లోని ముషీరాబాద్ కు చెందిన శామీర్ పేట నరేంద్రాచారి, స్వప్న దంపతుల కుమార్తె ఆశ్రిత మల్లారెడ్డి టెక్నికల్ క్యాంపస్ లో ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించారు.రెక్కల కష్టంపై బతికే నరేంద్రాచారి హఠాన్మరణం పాలవడంతో బిడ్డ చదువు అగమ్యగోచరంగా మారింది.విద్యార్థిని తల్లి స్వప్నకు కుమార్తె కాలేజీ ఫీజు చెల్లించడం భారంగా మారింది. ఈ నేపథ్యంలో విశ్వకర్మ టీవీ చానల్ నిర్వాహకుడు నర్సింహా చారిని సంప్రదించగా ఆయన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కి ఆశ్రిత పరిస్థితిని వివరించారు.ఆమె ముందుకు వచ్చి ఆశ్రిత ఫీజు చెల్లిస్తానని భరోసానిచ్చారు.మొదటి సంవత్సరం ఫీజు మొత్తాన్ని శుక్రవారం ఆశ్రిత,ఆమె తల్లి స్వప్నకు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.





# అడ్వెంచర్ రోల్స్ కావాలంటున్న తమన్నా


తెలుగు టూ తమిళం వయా హిందీ అన్నట్లు ఉంటుంది ఈమె కెరీర్. అన్నిచోట్లా జెండా పాతేసారు. 20 ఏళ్లుగా సినిమాలు చేస్తూనే ఉన్నారు. తాజాగా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్ అయిపోయారు మిల్కీ బ్యూటీ. ముఖ్యంగా బాలీవుడ్‌లో తమన్నాకు డిమాండ్ మామూలుగా లేదిప్పుడు. ఓవైపు హీరోయిన్‌గా నటిస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్ చేయడం తమన్నా స్పెషల్. అంతేకాదు.. తమన్నా తమ సినిమాలో చిందేస్తే సినిమా హిట్ అని నమ్ముతుంటారు మేకర్స్. రైడ్ 2, స్త్రీ 2 ఇలా చాలా వరకు తమన్నా స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చిన సినిమాలు కాసులు కురిపించడంతో ఈ సెంటిమెంట్ మరింత బలపడింది. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేసారు తమన్నా.. ఇప్పుడు వెబ్ సిరీస్‌లు కూడా చేస్తున్నారు. యాక్షన్, కామెడీ, హిస్టారికల్, హార్రర్.. అన్ని జోనర్స్ ఆల్‌మోస్ట్ టచ్ చేసారు మిల్కీ బ్యూటీ. ఇన్ని చేసిన తనకు అడ్వంచరస్ రోల్ చేయాలనే కోరిక మాత్రం అలాగే ఉండిపోయిందంటున్నారు ఈ సీనియర్ హీరోయిన్. ఇప్పటి వరకు ఆ రోల్ తనకెవరూ ఆఫర్ చేయలేదన్నారు ఈమె. ఇండియన్ సినిమాలో హీరోయిన్లతో అడ్వంచరస్ రోల్స్ ఎవరూ పెద్దగా ఎక్స్‌ప్లోర్ చేయలేదని.. తనకు అలాంటి క్యారెక్టర్స్ చేయాలని ఉందంటూ మనసులో మాట బయటపెట్టారు తమన్నా. బాహుబలిలో యాక్షన్ సీక్వెన్స్‌లు అదరగొట్టిన తమన్నాకు పూర్తిస్థాయి అడ్వంచరస్ రోల్ చేసే ఆఫర్ ఇచ్చే ఆ దర్శకుడెవరో చూడాలిక.


# ఓటిటిలోకి కిష్కింధపురి

బెల్లకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కిష్కింధపురి' కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వంలో హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందింది. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జీ5 వేదికగా అక్టోబర్ 17 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దీని ఓటీటీపై కొన్ని రోజులుగా ఎన్నో తేదీలు సోషల్ మీడియాలో షేర్ అయ్యాయి. ఇప్పుడు జీ5 ఈ తేదీని అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 17 సాయంత్రం 6 నుంచి ఈ సినిమా ఓటీటీలోకి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించింది. అలాగే అక్టోబర్ 19 సాయంత్రం జీ టీవీలో దీన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపింది. రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ప్రేమికులు. ఆ ఇద్దరూ మరొక స్నేహితుడు (సుదర్శన్)తో కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్‌ని నిర్వహిస్తుంటారు. థ్రిల్ కోరుకునేవాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలు ఉన్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే ఆ టూర్ ఉద్దేశం. అలా ఓసారి 11 మందితో కలిసి కిష్కింధపురి అనే ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌కి వెళతారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. సువర్ణమాయలోకి అడుగుపెట్టిన 11 మందిలో ఎవరినీ వదిలిపెట్టనని వార్నింగ్ ఇస్తుంది వేదవతి. ఆ తర్వాత అందులోని ఓ చిన్నారి టార్గెట్ అవుతుంది. అది పసిగట్టిన రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎదురెళతాడు. మరి ఆ చిన్నారిని రక్షించాడా? మిగిలినవాళ్ల పరిస్థితి ఏమిటి? అసలు ఆ వేదవతి ఎవరు? ఎందుకు దెయ్యంలా మారింది? సువర్ణమాయ స్టేషన్‌తో ఆమెకున్న సంబంధం ఏమిటి? అందులోకి వెళ్లిన వాళ్లని ఎందుకు చంపేస్తోంది?అన్నది చిత్ర కథ.

# 500 కోట్ల క్లబ్‌లో కాంతారా

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కాంతార చాప్టర్ 1' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మరో ఘనతను సొంతం చేసుకుంది. విడుదలైన 9 రోజుల్లోనే రూ.500 కోట్ల క్లబ్‌లో స్థానం సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా సాధించిన వసూళ్లను తెలుపుతూ నిర్మాణసంస్థ తాజాగా పోస్టర్ విడుదల చేసింది. వరల్డ్ వైడ్‌గా రూ.509 కోట్లు సాధించినట్లు తెలిపింది. ఇప్పటికే పలు సినిమాల రికార్డులు తిరగరాసిన 'కాంతార 1'.. ఇప్పుడు 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన రెండో సినిమాగా నిలిచింది. త్వరలోనే మొదటి స్థానంలోకి వెళ్లే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ ఏడాదిలో విడుదలైన 'ఛావా' రూ.600 కోట్లతో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల వరుసలో టాప్‌లో ఉంది. 'కాంతార 1' థియేటర్‌లలో హౌస్‌ఫుల్ బోర్డులతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. దీంతో ఈ రికార్డును మరికొన్ని రోజుల్లోనే బీట్ చేసి టాప్‌వన్‌లో నిలిచే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సినిమా విజయం సాధించడంతో రిషబ్ వరుస ఇంటర్వ్యూలతో దీన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇండస్ట్రీలో ఎంతోమంది టాలెంటెడ్ దర్శకులు ఉన్నారు. వారందరితో పోలిస్తే నేను చిన్న పిల్లాడిని. కానీ, వాళ్లందరూ కాంతారపై ప్రశంసలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ఈ విజయం నా బాధ్యతను రెట్టింపు చేసిందని చెప్పారు.



# రీ ఎంట్రీ కోసం పూజా హెగ్డే తంటాలు



చేతిలో ఉన్న సినిమాలు ఆడక.. కమిటైన సినిమాలు ఆగిపోయి.. సెలెక్ట్ అయిన సినిమాల నుంచి తప్పించి.. ఓ టైమ్‌లో చుక్కలు చూసింది పూజా. తెలుగులో ఈమె కెరీర్ పూర్తిగా గాడి తప్పింది. టాలీవుడ్ పట్టించుకోకపోవడంతో తమిళం, హిందీపై ఫోకస్ చేస్తున్నారు పూజా. ఈ మధ్యే తమిళంలో సూర్యతో నటించిన రెట్రో డిజాస్టర్ కావడం పూజాకు మరో దెబ్బ. కలిసొస్తుందనుకున్న కూలీ కూడా ఈమెకు పెద్దగా వర్క్ అవ్వలేదు. మోనిక సాంగ్ హిట్టైనా.. సినిమా ఫట్ అయింది. తెలుగులో చాలా రోజుల తర్వాత దుల్కర్ సల్మాన్ సినిమా సైన్ చేసారు పూజా. దుల్కర్ సినిమా కోసం ఏకంగా 2.5 కోట్ల వరకు పారితోషికం అందుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఫ్లాపుల్లో ఉన్నపుడు కూడా ఈ స్థాయి రెమ్యునరేషన్ అంటే చిన్న విషయం కాదు. ప్రస్తుతం ఈమె చేతిలో దుల్కర్‌తో పాటు విజయ్ జన నాయగన్ ఉన్నాయి. మరి పూజా ఈ రెండు సినిమాలతో కమ్ బ్యాక్ ఇస్తారా లేదా చూడాలిక.

# రాజాసాబ్‌లో మాస్ లుక్‌లో ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించే సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్న సంగతి తెలిసిందే. కల్కి సూపర్ హిట్ తర్వాత చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు మన డార్లింగ్. కాగా ఈ మూవీ లిస్ట్ లో రాజసాబ్ మూవీ పై భారీ అంచనాలు ఉన్నాయి. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరికొత్త లుక్ లో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్ర బృందం కొన్ని పోస్టర్లు, గ్లింప్స్ విడుదల చేసి ఆసక్తిని పెంచింది. అయితే తాజాగా ప్రభాస్ కి సంబంధించిన ఓ కొత్త వీడియో ట్రెండింగ్ అవుతుంది. ఇందులో ప్రభాస్ మాస్ లుక్ లో తలపాగ.. రంగు రంగుల డ్రెస్సింగ్ తో స్టెప్ లేస్తు కనిపించారు. ప్రజంట్ ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది